అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

మేయర్ కోవెలమూడి రవీంద్ర

నెహ్రూ నగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 23 ఫిర్యాదులు తీసుకున్నారు. అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలని సూచించారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని కోరారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని మాట్లాడుతూ ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామని చెప్పారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 41 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 17, ఇంజినీరింగ్ విభాగానికి 11, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 7, ఉపా సెల్ విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిపి రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, మేయర్ రవీంద్ర

బక్రీద్ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

నగరంలో బక్రీద్‌ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నగరపాలక సంస్థకు ముస్లింలు సహకరించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. సోమవారం నగరపాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ నెల 7న బక్రీద్ నిర్వహణపై ముస్లిం, హిందూ మత పెద్దలు, గో సంరక్షణ సమితి సభ్యులు, పశు సంవర్ధక శాఖ, నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులతో ప్రత్యేక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ హిందూ, ముస్లిం ఐక్యతకు గుంటూరు నగరం ఆదర్శం అని చెప్పారు. రోడ్లపై ఆవులను సంరక్షించడానికి త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో ఎక్కడైనా గోవధ జరిగితే నగరపాలక సంస్థ కాల్ సెంటర్‌కు, ప్రత్యేక బృందాలకు తెలియజేయాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ అనధికార జంతు వధ నిషేధమని, నగర పాలక సంస్థ ఏర్పాటు చేసే తాత్కాలిక జంతు వధశాలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం నిబంధనలు పాటిస్తూ పండుగ చేసుకొనే విధానంపై సూచనలతో రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డీఏహెచ్ఓ కేవీ సత్యనారాయణ, డీడీ ఎం.రత్నజ్యోతి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, వీఏఎస్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పూడికతీత పనులు పక్కాగా జరగాలి..

నగరంలో పూడికతీత పనులు సంపూర్ణంగా, నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ జరగాలని, డివిజన్ల వారీగా జరిగిన పనులను నేరుగా పరిశీలిస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో పూడికతీత పనుల పురోగతి, తాగు నీటి సరఫరా, అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావాలి, షేక్ ఖాజా మొహిద్దీన్ చిష్తీ, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం అన్న క్యాంటీన్‌లో నాణ్యతతో కూడిన ఆహారం అందించాలని నగర మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. సోమవారం చుట్టుగుంటసెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

క్లుప్తంగా

వీసాలు నిలిపివేయటం అమెరికాకే నష్టం

లక్ష్మీపురం: చదువుల నిమిత్తం జారీ చేసే వీసాలకు సంబంధించిన ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేస్తూ అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మన దేశం నుంచి అక్కడకు వెళ్ళదలుచుకున్న లక్షలాది మంది విద్యార్థులను అయోమయంలోకి నెట్టిందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన చర్చలో ఆయన మాట్లాడారు. దీనివల్ల బిజినెస్ స్కూళ్లలో చదవదల్చుకుని, చేస్తున్న ఉద్యోగాలకు రాజీనామా చేసి ఎదురుచూస్తున్న వారు చాలా ఇబ్బందులు పడతారని అన్నారు. ఇంటర్వ్యూ ప్రక్రియ ఎప్పుడూ ఉంటుందో ఎంపిక ప్రక్రియలో అనుసరించబోయే విధానాలు ఎలా ఉంటాయోనన్న విషయాలు అందరినీ కలవరపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి తప్పుడు విధానాల వల్ల అంతిమంగా నష్టపోయేది అమెరికాయేనని, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని అన్నారు.

జర్నలిస్టులకు ఆటవిడుపు అవసరం

కమిషనర్ పులి శ్రీనివాసులు



గుంటూరు వెస్ట్: వృత్తిలో ఒత్తిడిలో ఉండే జర్నలిస్టులకు క్రీడల ద్వారా చక్కని ఆటవిడుపు లభిస్తుందని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానం ప్రారంభమైన క్రికెట్ పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి పాల్గొననున్న జర్నలిస్టులను అభినందించారు. అనంతరం బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సాయికృష్ణ, మాజీ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజు నాయుడు, కమిటీ సభ్యులు ఉదయ్, రాజేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

జీఎస్టీ కార్యాలయ సూపరింటెండెంట్ మృతికి నివాళి



లక్ష్మీపురం: కస్టమ్స్, జీఎస్టీ గుంటూరు డివిజన్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పి.వినోద్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. బుచ్చయ్య తోటలోని నివాసంలో ఉంచిన వినోద్ కుమార్ భౌతిక కాయాన్ని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్ సోమవారం సందర్శించి, నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను కమి షనర్ పరామర్శించి, ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్లు ఎం.నాగరాజు, బి.రవికుమార్, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, ఆర్.పి.పి.కుమార్, టి.వి.జి. కె.మూర్తి, మిక్కిలినేని శ్రీనివాస్, పెన్షనర్ల సంఘ నేతలు టి.వివేకానంద, పి.వి.సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, జి.సీతారామయ్యచౌదరి, ఎన్.ఎస్.నగేష్ బాబు, సామ్రాజ్యం, మేరీమనోరంజని ఉన్నారు.

శ్రీమద్భగవద్గీత ప్రవచనం ప్రారంభం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం అన్నమయ్య కళావేదికపై శ్రీ మద్భగవద్గీత 15వ అధ్యాయం పురుషోత్తమప్రాప్తియోగం ప్రవచనం సోమవారం ప్రారంభమైంది. బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యంతో జరగ్గా, ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. చిన్మయమిషన్ బ్రహ్మచారి సుధీరానందస్వామి ప్రవచనాన్ని ప్రారంభిస్తూ గుణత్రయవిభాగ యోగంలో భక్తి ద్వారా త్రిగుణాలు దాటవచ్చని అన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



లక్ష్మీపురం: గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటనపై సోమవారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కన్నవారితోట 1వ లైన్ సియోను చర్చి వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆరు నెలలుగా చర్చి వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యంతో చర్చి వద్ద మృతి చెందాడు. దీంతో సమాచారం తెలుసుకున్న నగరంపాలెం పోలీసులు ఘటనా ప్రదేశంలో విచారించగా ఎలాంటి సమాచారం తెలియదని చెప్పడంతో గుర్తు తెలియని మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు స్టేషన్ ఎస్‌హెచ్ఓ 8688831336, నగరంపాలెం పోలీస్ స్టేషన్ 0863-2234047, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు 9949744717కు సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శ్రీచైతన్య విజయకేతనం

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తెలిపారు. లక్ష్మీపురంలోని సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో దుర్గాప్రసాద్ మాట్లాడారు. గుంటూరు జోన్‌లో అన్ని కేటగిరీల వారీగా ఎస్.హేమంత్ అభిరామ్ 48వ ర్యాంకు, బి. రుద్రతేజ 309వ ర్యాంకు, బి.రాజునాయక్ 378వ ర్యాంకు, జి.వైష్ణవి 405వ ర్యాంకు, కె.హర్షవర్ధన్ 414వ ర్యాంకు, ఎండీ తబీష్ అమన్ 674వ ర్యాంకులతో పాటు వెయ్యిలోపు 21, రెండువేల లోపు 34, ఐదువేల లోపు 66, 10వేల లోపు 127 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని వివరించారు. ఈసందర్భంగా సంస్థ అకడమిక్ డైరెక్టర్ బొప్పున సుష్మ, ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్, డీన్స్ సురేష్, చంద్రశేఖర్, కృష్ణ, అసోసియేట్ డీన్ హరిబాబు, ఏజీఎం ఎల్‌టీసీ శ్రీనివాస్, వివిధ క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు.



విద్యార్థులతో దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్స్

ఎస్ఆర్ కళాశాల విద్యార్థుల సత్తా..

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో సత్తా చాటారని ఎస్ఆర్ కళాశాల డీజీఎం రమణ, కోర్ డీన్ అరవింద్ పేర్కొన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఎస్ఆర్ కళాశాలలో సోమవారం విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్థాపించిన అతి తక్కువ కాలంలోనే జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ద్వారా ఎన్ఐటీ, ఐఐటీల్లో సీట్లు సాధించే స్థాయికి చేరుకున్నామని తెలిపారు. అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు వివిధ కేటగిరీలో వారీగా ఎం.రవిచంద్రారెడ్డి 8వ ర్యాంకు, వి.నాగసిద్ధార్థ 13వ ర్యాంకు, పి.సాక్షి 40వ ర్యాంకు, ఎ.అమృత 47వ ర్యాంకు, బాణావత్ సాయి 68వ ర్యాంకు, వై.భరణి శంకర్ 90వ ర్యాంకు సాధించారని వివరించారు. టి.తేజస్ ఉద్భవరెడ్డి గుంటూరు బ్రాంచ్ నుంచి అఖిల భారతస్థాయి ఓపెన్ కేటగిరీలో 662వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. పాఠశాల స్థాయిలో ఐఐటీ ఫౌండేషన్ లేకున్నప్పటికీ, రెండేళ్ల ఇంటర్‌తోనే అసాధారణ ఫలితాలు సాధించామని వివరించారు. పటిష్టమైన విద్యా ప్రణాళికతో ఒక్క బ్రాంచి నుంచే 15 మంది విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధించే విధంగా కృషి చేశామని చెప్పారు. 5వ బ్యాచ్ విద్యార్థులతో, అతి తక్కువ సమయంలో అఖిల భారతస్థాయిలో ర్యాంకులు కైవసం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ పూర్ణచంద్రరావు, డీన్‌లు అప్పిరెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ సురేష్, ఉదయ్, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డీజీఎం రమణ, అరవింద్, పూర్ణ చంద్రరావు

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మాట్రిక్స్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో మాట్రిక్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు డైరెక్టర్లు రామిరెడ్డి, ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీల్లో డి.శివతేజ 1179, కె.పరిమళ సౌమ్య 2682, కె.చరణ్ తేజ 3041, జేవీ హర్ష నారాయణ 2051, సీహెచ్ హాసిని 5060, ఎం.చెల్సీ 5376వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఏఐఎస్ఎఫ్ వినతి

లక్ష్మీపురం: సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజకు సోమవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో విన్నవించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండు శివ, బి.యశ్వంత్ మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీటి సదుపాయం, గదులలో లైట్లు, ఫ్యాన్లు, నాణ్యమైన ఆహారం అందించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రణీత్, ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి డేవిడ్, పవన్, అజయ్ పాల్గొన్నారు.



ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

జిల్లాలో విద్యారంగాభివృద్ధికి ఖాసిం కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరుజిల్లా విద్యారంగాభివృద్ధిలో ఖాసిం మాస్టారు తనదైన ముద్ర వేశారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ పేర్కొన్నారు. గ్రేడ్-2 హెచ్ఎంగా ఉద్యోగోన్నతిపై యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాధ్యతలు చేపట్టిన షేక్ మొహ్మద్ ఖాసిం సోమవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా విద్యాశాఖలో అజాత శత్రువుగా అధికారులు, ఉపాధ్యాయులతో స్నేహపూర్వకంగా మెలగుతూ విద్యార్థుల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగ చైర్మన్ ఎం.హనుమంతరావు మట్లాడుతూ గుంటూరుజిల్లా విద్యాశాఖకు అనుబంధంగా ఖాసిం అందించిన సేవలు మరువలేనివని, ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఖాసింను సత్కరించిన వారిలో యూటీఎఫ్ జిల్లా నాయకులు జి. వెంకటేశ్వర్లు, కె.రంగారావు, పి.హనుమంతరావు, కె.చెన్నకేశవరావు, గఫార్, ఎం.ధనరాజారావు ఉన్నారు.



ఖాసింను సన్మానిస్తున్న యూటీఎఫ్ బృందం

మలేరియాపై అవగాహన ర్యాలీ

గుంటూరు మెడికల్: మలేరియా నివారణ మాసోత్సవంలో భాగంగా చేపట్టిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సోమవారం ప్రారంభించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం, బృందావన్ గార్డెన్స్‌లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో మలేరియా నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ జూన్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు మలేరియా మాసంగా పాటించి, మలేరియా నివారణ చర్యలైన, దోమకాటును నివారణ, సాయంత్రం వేప పొగ వేయడం, నీటి నిల్వలు పరిశుభ్రం చేయడం, దోమతెరలు వాడుటం, పరిసరాల పరిశుభ్రత లాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని కోరారు. దోమల లార్వాలు, అడల్ట్ మస్కిటో చర్యలపై ఈ నెల మొత్తం ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. తద్వారా మలేరియా నివారణ చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ర్యాలీ దోమల నివారణ చర్యలపై నినాదాలు చేస్తూ పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి బృందావన్ గార్డెన్స్ సెంటర్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి, సబ్ యూనిట్ ఆఫీసర్లు ఘంటసాల శ్రీనివాసరావు, నరేంద్రబాబు, ఆరోగ్య విస్తరణ అధికారి గణేష్, డెప్యూటీ డెమో ఎస్ వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

నేటి నుంచి జగన్నాథస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: స్థానిక కొత్తపేట జగన్నాథస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల మూడో తేదీ నుంచి తొమ్మిది వరకు నిర్వహించనున్నట్లు దేవస్థానాల ఈఓ టి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయంస్వామి వారిని పెళ్లి కుమారుడిగా, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరణ, సాయంత్రం అంకురారోపణ, ధ్వజారోహణ, విశ్వక్సేన పూజ, పుణ్యావచన, అఖండ దీపారాధన, నవకుంభరోహణ, అగ్ని ప్రతిష్ట జరగనున్నాయని పేర్కొన్నారు. నాలుగో తేదీన వేణు గోపాలస్వామికి గంధంతో అలంకరణ, లక్ష్మీసుదర్శన హోమం, ఐదున స్వామికి లక్ష్మీ నరసింహ అలంకరణ, లక్ష్మీనరసింహ హోమం, ఆరున పచ్చ కర్పూర అలంకరణ, లక్ష్మీగణపతి హోమం, రాత్రి రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి తిరు కల్యాణం, ఏడున వేణుగోపాలస్వామికి తులసి అలంకరణ, గరుడ వాహనంపై గ్రామోత్సవం, స్వామి దివ్య రథోత్సవం, ఎనిమిదిన వసంతోత్సవం, చక్రస్నానం, తొమ్మిదిన లక్ష తులసీదళార్చన, రాత్రి ద్వాదశ ప్రదక్షిణాలు పవళింపు సేవ నిర్వహిస్తామని ఈఓ తెలిపారు.



కొత్తపేటలోని జగన్నాథస్వామి దేవస్థానం

• ఫుట్‌పాత్‌పై నడక ఎలా!



రింగ్‌రోడ్డులోని ఓ హోటల్ వద్ద ఫుట్‌పాత్‌పై ప్రచార హోర్డింగ్‌లు



ఫుట్‌పాత్‌పై ద్విచక్ర వాహనాల పార్కింగ్

ప్రధాన రహదారి వెంబడి కాలినడక బాట ఆక్రమణలకు గురైంది. నడిచేందుకు వీల్లేకుండా దుకాణాలు వెలిశాయి. కొన్నాళ్ల క్రితం రింగ్‌రోడ్డు నుంచి చంద్రమౌళినగర్ వరకు ఫుట్‌పాత్‌ను సుందరంగా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పాదచారులు, బాటసారుల సౌకర్యార్థం ఫుట్‌పాత్ నిర్మించారు. ప్రధాన రహదారిపై నవభారత్‌నగర్, విద్యానగర్, కొరిటెపాడు తదితర ప్రాంతాలకు నడిచి వెళ్లేందుకు కష్టంగా ఉంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీని తలపిస్తోంది. దీంతో రాకపోకలు చేసేందుకు ఫుట్‌పాత్ అనువుగా ఉండేది. అయితే ఫుట్‌పాత్‌పై అల్పాహార బండ్లు, బంక్‌లు ఏర్పాటు చేశారు. అంతేగాక ద్విచక్ర వాహనాల విక్రయాలు చేసే దుకాణ దారులు వాహనాలను ఫుట్‌పాత్‌లపై నిలుపుదల చేశారు. ఓ భారీ హోటల్ సమీపాన ఉన్న ఫుట్‌పాత్‌పై జీఎంసీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

– నగరంపాలెం

మహాప్రస్థానానికి ప్రత్యేక స్థానం



లక్ష్మీపురం: ఆధునిక తెలుగు కవిత్వంలో మహాప్రస్థానం చెరగని ముద్ర వేసిందని విశాలాంధ్ర మాజీ జనరల్ మేనేజర్ గూడవల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం మహాప్రస్థానం పుస్తకం ప్రచురించి 75 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా శ్రీశ్రీకి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 1933–47 మధ్య కాలంలో నాటి సామాజిక పరిస్థితులే మహాప్రస్థానం గేయాలుగా శ్రీశ్రీ కలం నుంచి పుట్టుకొచ్చాయన్నాని చెప్పారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మహాకవి శ్రీశ్రీ అభిమాని విశ్రాంత ఇంజనీర్ ఎన్.సదాశివం మాట్లాడుతూ మహాప్రస్థానం కావ్య స్థానం చెక్కు చెదరలేదని చెప్పవచ్చన్నారు. తొలుత శ్రీ శ్రీ చిత్ర పటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పది విద్యార్థుల జీవితాలతో చెలగాటం

లక్ష్మీపురం: రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెలగాటం ఆడుతున్నారని జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు షేక్ కరీం విమర్శించారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. పరీక్షల్లో అత్యధిక మంది ఫెయిల్ కావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనుమానంతో 66,000 మంది రీవాల్యుయేషన్ కింద దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. అందులో 11వేల మంది పాస్ అయ్యారని వివరించారు. పరీక్ష ఫలితాలల్లో అవకతవకలపై మంత్రి లోకేష్ ఇంత వరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఈ విధంగా విద్యార్థుల భవిష్యత్, ప్రాణాలతో అధికారులు, కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు.

మున్సిపల్ శాఖ మంత్రితో చర్చలు విఫలం

నెహ్రూనగర్: పారిశుద్ధ్య కార్మికులకు తగిన జీతాలు చెల్లించాలని కోరుతూ మున్సిపల్ మంత్రి నారాయణతో సోమవారం నిర్వహించిన చర్చలు విఫలమైనట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదులమూడి మధుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు గత ప్రభుత్వం 15 వేల నుంచి 21 వేల రూపాయలకు జీతం పెంచిందో అదే జీతం నాన్ పీహెచ్ ఉద్యోగులకు చెల్లించాలని కోరినట్లు చెప్పారు.

ఘనంగా తారకేశ్వర చక్రవర్తి శత జయంతి



కొరిటెపాడు(గుంటూరు): భారతదేశ బ్యాంకింగ్ వ్యవస్థలో ఉద్యోగులు, అధికారులకు మొట్టమొదటిసారిగా 1986 నుంచి పెన్షన్ సాధించి పెట్టిన మహనీయుడు ఏఐబీఏయూ ప్రధానకార్యదర్శి దివంగత తారకేశ్వర చక్రవర్తి శత జయంతి వేడుకలను సోమవారం గుంటూరులోని శ్రీనగర్ కాలనీ 7వ లైనులోని మాతృశ్రీ ఓల్డేజ్ హోమ్‌లో నిర్వహించారు. ఓల్డేజ్ హోమ్‌లో వృద్ధుల నిరంతర విద్యుత్ సదుపాయం కోసం గుంటూరు జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ఇన్వర్టర్ బహూకరించారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘ కార్యదర్శి బాషా, అధ్యక్షుడు రవి చంద్రారెడ్డి, సంఘం నాయకులు రామకృష్ణ, షరీఫ్, వెంకటేష్ పాల్గొన్నారు.

మండల స్థాయి యోగా పోటీలు

గుంటూరు రూరల్: ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న యోగా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండల స్థాయి యోగా పోటీలను మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. స్థానిక సమావేశ మందిరంలో జరిగిన ఈ పోటీల్లో సచివాలయాల పరిధిలో మెడిటేషన్, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, యోగా పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలిచిన సిబ్బంది మండల స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కె.విద్యాసాగర్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.